సాక్షి
గుంటూరు

బుధవారం । 7 । మే । 2025



శిక్షణ తరగతులు పరిశీలన

చుండూరు(వేమూరు): వలివేరు గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులను ఉమ్మడి జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి సుబ్బ రత్తమ్మ మంగళవారం పరిశీలించారు.



వైభవంగా బ్రహ్మోత్సవాలు

పొన్నూరు: సుందరవల్లీ సమేత సాక్షి భావన్నారాయణస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం పంచామృత స్నపన నిర్వహించారు.

దుర్గగుడి ఈఓగా శీనానాయక్



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన ఈఓగా శీనా నాయక్‌ను నియమిస్తూ ప్రభుత్వం జీఓ జారీ చేసింది. ఆయన బుధవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని ఆలయ వర్గాలు పేర్కొన్నాయి.

న్యూస్‌రీల్

కోర్టును సందర్శించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి



పొన్నూరు: జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ్ చక్రవర్తి మంగళవారం పట్టణంలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టును సందర్శించారు. నూతనంగా నిర్మాణం చేపట్టాల్సిన కోర్టు భవనాలకు సంబంధించిన విషయాలను తెలుసుకున్నారు. ఆయనకు కోర్టు న్యాయమూర్తి ఏకా పవన్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ బాజీ సాహెబ్, సభ్యులు పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పొందుగుల జయరాజు, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ తూమాటి రమేష్, ఏజీపీ ఎస్.శ్రీనివాస్, న్యాయవాదులు, గుమస్తాలు, సిబ్బంది పాల్గొన్నారు.

జెడ్పీ బడ్జెట్‌ను ఆమోదించిన ప్రభుత్వం

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ 2025–26 ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ప్రభుత్వం ఆమోదించింది. ఈమేరకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ మంగళవారం ఉత్తర్వులు విడుదల చేశారు. గత మార్చి 31 నాటికే ఆమోదం పొందాల్సిన బడ్జెట్‌ను ఆమోదించలేకపోవడంతో పంచాయతీరాజ్ చట్టంలోని సెక్షన్ 199 సబ్ రూల్ 3 కింద బడ్జెట్ ఆమోదం కోసం జెడ్పీ సీఈవో వి.జ్యోతిబసు గత నెలలో ప్రభుత్వానికి పంపారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.643 కోట్ల ఆదాయంతో రూపొందించిన అంచనా బడ్జెట్‌ను ఆమోదించారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా కె.శ్రీనివాస్



నెహ్రూనగర్: గుంటూరు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా కె.శ్రీనివాస్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. రెవెన్యూ సర్వీసెస్ నుంచి డెప్యూటీ కలెక్టర్ స్థాయిలో పనిచేస్తున్న ఆయన్ను గుంటూరు ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా బదిలీ చేశారు. గతంలో ఈడీగా పనిచేసిన పి.ప్రేమకుమారి ఉద్యోగ విరమణ చేయడంతో ఇన్‌చార్జి ఈడీగా దుర్గాబాయి బాధ్యతలు నిర్వహించారు. నూతన ఈడీగా శ్రీనివాస్ బాధ్యతలు చేపట్టి, కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందజేశారు.

జిల్లాలో ఏఎస్‌ఐలు, హెచ్‌సీలు, కానిస్టేబుళ్ల బదిలీలు



నగరంపాలెం: జిల్లాలోని పోలీస్‌స్టేషన్‌లో ఐదేళ్లు పూర్తయిన కానిస్టేబుళ్లు నుంచి ఏఎస్‌ఐలకు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో బదిలీల ప్రక్రియ చేపట్టారు. ఈ ప్రక్రియను జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ పర్యవేక్షించారు. 12 మంది ఏఎస్‌ఐలు, 27 మంది హెడ్ కానిస్టేబుళ్లు, మరో 27 మంది కానిస్టేబుళ్లకు స్థానచలనం చేశారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ మాట్లాడుతూ సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని అన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలకు సేవలందించేందుకు అందుబాటులో ఉండాలని చెప్పారు.జిల్లా ఏఎస్పీ జీవీ.రమణమూర్తి (పరిపాలన), ఏఓ అద్దంకి వెంకటేశ్వరరావు, జిల్లా ఎస్పీ సీసీ ఆదిశేషు, జూనియర్ సహాయకులు పాల్గొన్నారు.

రైల్వే అధికారులకు ఆహ్వానం లేదు

లక్ష్మీపురం: శంకర్ విలాస్ ఫ్లైఓవర్ శంకుస్థాపనకు గుంటూరు రైల్వే డివిజన్ అధికారులకు ఎలాంటి ఆహ్వానం లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు చేతుల మీదుగా బుధవారం శంకుస్థాపన చేసేందుకు ముహూర్తం నిర్ణయించారు. అయితే అనివార్య కారణాల వల్ల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాకపోవడంతో బుధవారం ఉదయం 9 గంటలకు కేంద్ర సహాయక మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ శంకుస్థాపన చేయనున్నారు. శంకుస్థాపనకు సంబంధించి ఎటువంటి సమాచారం లేకపోవడంతో గుంటూరు డీఆర్ఎం బుధవారం ఉదయం రేపల్లె రైల్వేస్టేషన్ తనిఖీలకు వెళ్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఏమీ సేతుము చంద్రా..?

'సేతుబంధన్' నిధులతో సరి


- శంకరవిలాస్ మెగా ఫ్లై ఓవర్ స్థానంలో సాధారణ ఆర్‌ఓబీ
- ఇదేమి చంద్రశేఖరా.. అంటూ ఎంపీపై నగర ప్రజల మండిపాటు
- 1958లో నిర్మితమైన ప్రస్తుత ఆర్‌ఓబీ
- ఆర్‌యూబీ లేకుండానే నిర్మాణం
- భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం
- కేంద్రంతో పొత్తు ఉన్నా ఆర్‌ఓబీని మెగా ఫ్లై ఓవర్ గా మార్చు చేయించుకోలేని దుస్థితి
- మెగా ఫ్లై ఓవర్‌ను పక్కనపెట్టి రూ.98 కోట్లతో ఆర్‌ఓబీ నిర్మాణానికి హడావుడిగా ఏర్పాట్లు
- అందరూ వ్యతిరేకిస్తున్నా ముందుకు..
- నేడు శంకుస్థాపన

గుంటూరు ప్రజల చిరకాల వాంఛ అయిన మెగా ఫ్లై ఓవర్‌కు కూటమి ప్రభుత్వం మంగళం పలికింది. తూర్పు, పశ్చిమలను అనుసంధానం చేస్తూ ఎంతో కీలకమైన రవాణా వ్యవస్థ కలిగిన ఆర్‌ఓబీ స్థానంలో కొత్తగా మరొక ఆర్‌ఓబీ నిర్మాణాన్ని చేపట్టేందుకు ప్రతిపాదించిన పనులకు నేడు శంకుస్థాపన జరగనుంది. ప్రజల ఆకాంక్షలు, భవిష్యత్తు అవసరాలతో సంబంధం లేకుండా అరకొర నిధులతో సరిపెట్టేవిధంగా కూటమి నేతలు ముందుకెళుతుండడంపై అన్నివర్గాల్లో ఆగ్రహ జ్వాలలు వ్యక్తమవుతున్నాయి. నగరంలో ఆర్‌ఓబీని ఫ్లై ఓవర్‌గా మార్చి కట్టలేనివారు ఇక ఐకానిక్ బిల్డింగ్‌లు ఎలా కడతారంటూ ఎద్దేవా చేస్తున్నారు.



శంకర్ విలాస్ ఆర్‌ఓబీ

గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేట, బ్రాడీపేట మీదుగా తూర్పు, పశ్చిమ నియోజకవర్గాలను కలుపుతూ వెళుతున్న శంకర్‌విలాస్ సెంటర్ ఆర్‌ఓబీకి ఘన చరిత్ర ఉంది. 1958లో నిర్మించిన ఈ ఆర్‌ఓబీ దశాబ్దాల తరబడి గుంటూరు ప్రజల ట్రాఫిక్ అవసరాలను తీర్చుతూ, రవాణాలో కీలకంగా మారింది. 67 ఏళ్ల క్రితం నిర్మించిన రెండు లైన్లతో కూడిన ప్రస్తుత ఆర్‌ఓబీ స్థానంలో నాలుగు లైన్లుగా విస్తరించి నిర్మిస్తున్నామనే కారణం తప్ప, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెగా ఫ్లై ఓవర్ నిర్మాణాన్ని చేపట్టాలనే కనీస ఆలోచన, ముందు చూపు కూటమి ప్రభుత్వానికి కొరవడింది. సేతు బంధన్ ప్రాజెక్టు ద్వారా పూర్తిగా కేంద్ర నిధులపై ఆధారపడటం మినహా, గుంటూరు నగరాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పైసా నిధులు కేటాయించలేదు.



1958లో అప్పటి ముఖ్యమంత్రి నీలం సంజీవరెడ్డి శంకుస్థాపన చేసిన శిలాఫలకం

2017లో ప్రతిపాదనలు

2017లో గుంటూరు ఎంపీగా ఉన్న గల్లా జయదేవ్, అప్పటి ఆర్అండ్‌బీ మంత్రి అయ్యన్న పాత్రుడు శంకర్ విలాస్ బ్రిడ్జిని విస్తరించి, రూ.167 కోట్లతో లాడ్జి సెంటరు నుంచి హిందూ కాలేజీ జంక్షన్ వరకు మెగా ఫ్లైఓవర్ నిర్మిస్తామని, ముందుగా ఆర్‌యూబీ నిర్మిస్తామని ప్రకటించారు. ఇందు కోసం సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేశారు.

ఐకానిక్ కలలు ఆవిరి

నగరంలో పెరిగిన జనాభా, విస్తరిస్తున్న ప్రాంతాల దృష్ట్యా రోజుకు 50 వేల వాహనాల రవాణా బాధ్యతను మోస్తున్న బ్రిడ్జి స్థానంలో భవిష్యత్తులో వందేళ్ల అవసరాలు, ప్రజల ప్రయోజనాలు దృష్టిలో ఉంచుకుని మెగా ఫ్లై ఓవర్ నిర్మించాలని ప్రజల ఆకాంక్షగా ఉంది. బ్రిడ్జికి ఇరువైపులా విద్యా, వైద్యం, వ్యాపార కేంద్రాలు గత 70 ఏళ్లలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చెంది ప్రజలకు సేవలు అందిస్తున్నాయి. కాబట్టి వీటికి సాధ్యమైనంత వరకు నష్టం వాటిల్లకుండా ఒక ఐకానిక్ నిర్మాణం జరగాలని ప్రజలు కోరుకున్నారు. ఇందుకు అనుగుణంగా ఐకానిక్ ఫ్లైఓవర్ నిర్మాణ ప్రతిపాదన, డిజైను రూపకల్పన చేసి, నిర్మాణం చేపడతామని ప్రకటించారు. పెరుగుతున్న జనాభా, వాహనాల సంఖ్య రీత్యా ఈ రహదారిని ఆరులైన్ల రహదారిగా అభివృద్ధి చేస్తేనే ప్రజలకు భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు ఉండవని, అందుకనే నాలుగు లైన్ల ఫ్లైఓవర్‌ను నిర్మించి రెండు ఆర్‌యూబీ ఏర్పాటు చేసి ప్రజల అవసరాన్ని ఆకాంక్షలు తీరుస్తామని గతంలో ప్రకటించారు.

రూ.98 కోట్లతో సరి

కేంద్ర ప్రభుత్వ సేతు బంధన్ పథకం ద్వారా రూ.98 కోట్ల నిధులు మంజూరుకావడంతో హడావుడిగా ఆర్‌ఓబీ నిర్మాణానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మెగా ఫ్లై ఓవర్‌కు బదులు సాధారణ ఆర్‌ఓబీ నిర్మాణానికి ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికార యంత్రాగం తీసుకున్న చర్యలను నగరంలోని పన్ను చెల్లింపుదారులు, వ్యాపారస్తులు, మేధావులు, విద్యావేత్తలు, ఉద్యోగ, కార్మిక సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

ప్రజల్లో అసంతృప్తి

నగర ప్రజల రవాణా అవసరాలను తీర్చే మెగా ఫ్లై ఓవర్ ప్రాజెక్టును పక్కనపెట్టి, సాధారణ ఆర్వోబీని నిర్మించేందుకు హడావుడిగా చేస్తున్న పనులతో ప్రజల్లో అసంతృప్తి మొదలైంది. బ్రిడ్జి అవసరాలను బట్టి నిధులా?., నిధుల కేటాయింపులను బట్టి బ్రిడ్జా? అంటూ ప్రశ్నలు ఉత్పన్నమయ్యాయి. గతంలో ఇదే ప్రభుత్వానికి చెందిన ఎంపీ, మంత్రి ప్రతిపాదించిన రూ.167 కోట్ల ఐకానిక్ ఫ్లైఓవర్‌తో పాటు ఆరువైపులా ఆర్‌యూబీలు సైతం ఉన్న పరిస్థితుల్లో ఫ్లై ఓవర్‌ను కుదించడంతో ఒనగూరే లాభం కంటే నష్టమే అధికంగా ఉంది. రెండు కిలోమీటర్లకు పైగా పొడవు కలిగిన మెగా ఫ్లై ఓవర్‌తో ఇరువైపులా వ్యాపార, వర్తక, వైద్య, విద్యాలయాలకు అతి తక్కువ నష్టం వాటిల్లడంతో పాటు ఒకే పిల్లర్ ఉండటంతో పాటు ఇరువైపులా రెండు ఆర్‌యూబీలను నిర్మించడం వలన ఫ్లై ఓవర్ పూర్తయ్యే వరకు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఉంటాయి.

ప్రస్తుత డిజైనుతో వాటిల్లే నష్టాలు

930 మీటర్లకు కుదించిన బ్రిడ్జి కోసం 120 అడుగుల విస్తీర్ణంతో రోడ్డు అవసరమని 1.5 కిలోమీటర్ల మేర విస్తరణ చేస్తున్నారు. 70 అడుగుల వెడల్పుతో 930 మీటర్ల నిడివితో బ్రిడ్జిని నిర్మించబోతున్నారు. నాలుగు లైన్ల బ్రిడ్జి మధ్యలో 3.36 అడుగుల డివైడర్ రానున్నది. ఆర్‌ఓబీ నిర్మాణానికి రెండు, మూడేళ్లు పట్టనుంది. ఇటీవల మూడు వంతెనల వద్ద అదనపు ట్రాక్ నిర్మాణానికి మూడు నెలల పాటు రహదారిని మూసి వేసిన సమయంలో ట్రాఫిక్ కష్టాలను చవి చూసిన ప్రజలకు శంకర్‌విలాస్ ఆర్‌ఓబీ నిర్మాణం పేరుతో ప్రభుత్వం అది పెద్ద షాక్ ఇవ్వనుంది. రెండు, మూడేళ్లపాటు గుంటూరు నగరంలో ట్రాఫిక్, రవాణా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారనుంది. ఇన్ని సమస్యలతో ముడిపడి ఉన్న దృష్ట్యా, హడావుడిగా కాకుండా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని మెగా ఫ్లై ఓవర్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని శంకర్‌విలాస్ మెగాఫ్లై ఓవర్ సాధన జేఏసీ నాయకులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు. దీనిపై గత కొంత కాలంగా జేఏసీతో పాటు అన్ని సంఘాల నాయకులు ప్రభుత్వానికి వివిధ రూపాల్లో చేసిన విజ్ఞప్తులను బుట్టదాఖలు చేస్తూ, బుధవారం ఏసీ కళాశాల ఎదుట రూ.98 కోట్లతో ఆర్‌ఓబీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసేందుకు ఏర్పాట్లు చేశారు.

ధగధగ.. వెలవెల

- భారీగా పెరిగిన బంగారం ధర
- కొనుగోలుకు ప్రజలు వెనకడుగు
- కార్పొరేట్ షాపుల రాకతో స్థానిక దుకాణాలవైపు కన్నెత్తి చూడని వినియోగదారులు
- కొనుగోలు లేక వ్యాపారులు విలవిల
- ఉపాధి కోల్పోతున్న కార్మికులు



మంగళగిరిలోని ఓ దుకాణంలో ఆభరణాల తయారీలో నిమగ్నమైన స్వర్ణకారులు

తాడేపల్లి రూరల్: బంగారం ధర పదేళ్లలో నాలుగింతలు అయ్యింది. ఈ ఏడాది 10 గ్రాములు రూ.లక్ష దాటి ఆల్‌టైమ్ రికార్డు సృష్టించింది. ప్రస్తుతం స్వల్పంగా తగ్గుదల ఉన్నా... ఇదీ తాత్కాలికమే అంటున్నారు వ్యాపారులు. రాబోయే కాలంలో పెరగడమే తప్ప తగ్గే అవకాశం ఉండదంటున్నారు. సామాన్యులు కొనలేని స్థాయికి నేడు బంగారం ధర చేరింది. బంగారం ధరలు పెరుగుదల, మరోవైపు కార్పొరేట్ సంస్థల రాకతో స్థానిక వ్యాపారాలు వెలవెలబోతు న్నాయి. ఆభరణాల తయారీ కార్మికులు ప్రత్యామ్నాయ ఉపాధి వెతుక్కుంటూ వలసలు వెళ్లిపోతున్నారు.

2వేల మందికి ఉపాధి

మంగళగిరి పట్టణ పరిధిలో బంగారు ఆభరణాలు తయారీతో పాటు విక్రయించే వారు సుమారు 2 వేల మంది వరకు ఉన్నారు. గతంలో పెళ్లిళ్ల సీజన్లలో అందరూ చాలా బిజీగా ఉండేవారు. ప్రస్తుతం బంగారం ధర పెరగడంతో పెళ్లిళ్ల సీజన్ వచ్చినా ఎవరూ తయారు చేయించుకునేందుకు ముందుకు రావడం లేదని, విజయవాడ, గుంటూరు ప్రాంతాల్లో వెలసిన కార్పొరేట్ మాల్స్‌లో కొనుగోలు చేస్తున్నారని తయారీదారులు అంటున్నారు. బంగారం ధర విపరీతంగా పెరగడంతో వినియోగదారులు కొనుగోలు విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నారు. దీంతో స్థానిక జ్యూయలరీ షాపుల్లో సందడి కనిపించడం లేదు. దీనికి తగ్గట్లు వెండి కూడా దూసుకుపోతోంది.

సందడి లేని పెళ్లిళ్ల సీజన్

ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ నేపథ్యంలో కళకళలాడాల్సిన బంగారం షాపులు వెలవెల బోతున్నాయి. ఓవైపు ధరలు పెరగడం, మరోవైపు కార్పొరేట్ సంస్థల రాక ప్రధాన కారణమని జ్యూయలరీ షాపుల యజమానులు చెబుతున్నారు. ఈ రంగంలో ఆధునిక సాంకేతిక పరికరాలు రావడం, ధరల పెరుగుదల, కార్పొరేట్ సంస్థలు రెడీమేడ్ వ్యాపారం ప్రారంభించడంతో కార్మికులకు ఉపాధి కొరవడింది. దీంతో సుమారు 40 శాతం మంది ఇతర రంగాలకు తరలినట్లు జ్యూయలరీ వర్కర్లు చెబుతున్నారు.

ధరలు అమాంతం పెరిగాయి



బంగారం ధరలు అమాంతంగా పెరిగాయి. సాధారణ, మధ్యతరగతి ప్రజలు బంగారం చూసేందుకు తప్ప కొనుగోలు చేసే పరిస్థితి లేదు. గత రెండు రోజులుగా తగ్గిన బంగారం ధర మళ్లీ పెరిగింది. తులం బంగారం రూ.లక్ష దాటి అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. ధరలు ఇంకా పెరుగుతాయని కొందరు, తగ్గుతాయని మరికొందరు అంటున్నారు. మార్కెట్‌లో అనిశ్చితి ఏర్పడింది. కార్మికులకు ఉపాధి లేదు.

– కొల్లి లక్ష్మీ గిరిధరరావు, ఆంధ్రప్రదేశ్ స్వర్ణకార సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్

వ్యాపారాలు లేవు....



బంగారం ధరల హెచ్చుతగ్గుల ప్రభావం మార్కెట్‌పై తీవ్రంగా ఉంది. ఎప్పుడు పెరుగుతుందో ఎప్పుడు తగ్గుతుందో చెప్పలేని పరిస్థితి ఏర్పడింది. తగ్గిన తరువాత కొనుగోలు చేద్దామని కొనుగోలుదారులు అనుకోవడంతో వ్యాపారాలు తగ్గాయి. బంగారం రేటు రోజురోజుకు పెరుగుతోంది. దీంతో వ్యాపారాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం.

– కాటాబత్తుల శేషగిరిరావు, బంగారం వ్యాపారి, మంగళగిరి

10, 11 తేదీల్లో క్రికెట్ జట్ల ఎంపిక పోటీలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో 10వ తేదీన అండర్–23 మెన్ జిల్లా క్రికెట్ పోటీలను, 11వ తేదీని సీనియర్ జట్టు ఎంపికను నిర్వహిస్తామని త్రీమెన్ కమిటీ సభ్యుడు మహతీ శంకర్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీలను స్థానిక అరండల్‌పేటలోని పిచ్చుకులగుంట క్రీడా మైదానంలో ఏర్పాటు చేసామన్నారు. ఉదయం 8 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయని తెలిపారు. పాల్గొనే క్రికెటర్లు కావాల్సిన డాక్యుమెంట్లతో రావాలని తెలిపారు. ప్రతి క్రికెటర్ వైట్ డ్రెస్‌తోపాటు సొంత కిట్ తీసుకు రావాలన్నారు.

కూటమి ప్రైవేటు దోపిడీ

- స్ట్రీట్ వెండింగ్ పాలసీకి విరుద్ధంగా వీధి వ్యాపారుల నుంచి ఆశీలు వసూలు
- పండ్లు దిగుమతి చేసేవారి వద్ద మాత్రమే వసూలు చేసుకునేందుకు హక్కు
- అయితే నగరమంతా తిరిగి ఇష్టానుసారంగా వసూలు చేస్తున్న ప్రైవేటు వ్యక్తులు
- రోజుకు ఒక్కో వ్యాపారి నుంచి రూ.50 వసూలు
- నెలకు రూ.3లక్షలకు పైగానే కూటమి నేతల జేబుల్లోకి అక్రమ సంపాదన
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు



తాటిముంజలు అమ్ముకునే వ్యక్తి నుంచి డబ్బులు వసూలు చేస్తున్న ప్రైవేట్ వ్యక్తి



రూ.48 వసూలు చేసిన రశీదు

నెహ్రూనగర్: గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వీధి వ్యాపారుల నుంచి కూటమి నేతలు అనధికార వసూళ్లకు పాల్పడుతూ తమ జేబులు నింపుకొంటున్నారు. స్ట్రీట్ వెండింగ్ పాలసీకి వ్యతిరేకంగా వీధి వ్యాపారుల నుంచి డబ్బులు వసూలు చేస్తూ వారిని నిలువునా దోచేస్తున్నారు. ఇంత జరుగుతున్నప్పటికీ రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు.

ఇచ్చింది ఒకచోట.. వసూలు అంతటా..!

సంద్రీస్ మార్కెట్‌లో చెత్త ఆస్కారం లేకుండా పండ్లు దిగుమతులు చేసే వారి వద్ద నుంచి మాత్రమే ఆశీలు వసూలు చేసుకునే అవకాశం గత నెలలో కల్పించారు. అయితే ఇదే అదనుగా కూటమి నేతలు నగరం అంతా దొంగ టోకెన్లు ముద్రించి దర్జాగా వీధి వ్యాపారుల వద్ద నుంచి రోజుకు రూ.48 చిల్లర లేదంటూ రూ.50 వసూలు చేస్తున్నారు. ఈ విషయం అధికారులకు తెలిసినప్పటికీ చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు లేకపోలేదు.

చిరువ్యాపారులపై ప్రతాపం

గుంటూరు నగరానికి చుట్టుపక్కల గ్రామాలు, ఇతర ప్రాంతాల నుంచి చిరు వ్యాపారులు తట్ట బుట్టల్లో తాటి ముంజలు, బొప్పాయిలు, జామ కాయలు, ఈత కాయలు, ఇతర పండ్లు అమ్ముకునేందుకు వస్తుంటారు. వీరి వద్ద నిబంధనల మేరకు ఒక్క రూపాయి కూడా వసూలు చేయకూడదు. కానీ వారి అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకుని దౌర్జన్యంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నారు. ఒకవేళ మేం అంత ఇచ్చుకోలేమని.. ఏదో దూర ప్రాంతం నుంచి పొట్టకూటి కోసం వస్తున్నామని వేడుకున్నప్పటికీ ప్రతి రోజు డబ్బులు కట్టాల్సిందే.. మేము పాట పాడుకున్నాం. లేకపోతే రేపటి నుంచి వ్యాపారం చేసుకోనివ్వం అంటూ వారిపై దౌర్జన్యానికి దిగుతున్నారు. దీంతో చేసేదేమి లేక వారి అడిగినంత ఇచ్చేస్తున్నారు.

రోజుకు రూ.10వేలుపైనే ..

స్ట్రీట్ వెండింగ్ పాలసీపై కొంతమంది వెండర్స్ కోర్టును ఆశ్రయించడంతో గతంలో కమిషనర్‌గా పనిచేసిన కీర్తి చేకూరి ఈ టెండర్ ప్రక్రియ పాలసీపై ఒక నిర్ణయం తీసుకోవాల్సిందిగా ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చేదాకా వీధి వ్యాపారుల వద్ద నుంచి ఎటువంటి రుసుము వసూలు చేయకూడదని కౌన్సిల్‌లో కూడా తీర్మానం చేశారు. 2023 నుంచి సంద్రీస్ మార్కెట్(నగరం అంతా) ఆశీలు వసూలు చేసే కార్యక్రమం రద్దయింది. కానీ కౌన్సిల్ తీర్మానానికి విరుద్ధంగా టీడీపీకి చెందిన కాంట్రాక్టర్లు నగరం అంతా నలుగురు ప్రైవేట్ వ్యక్తులను పురమాయించి వీధి వ్యాపారుల నుంచి డబ్బులు దండుకుంటున్నారు. ఇలా రోజుకు రూ.10వేలుపైగానే, నెలకు రూ.3లక్షలకు పైగా కూటమి నేతల జేబుల్లోకి వెళుతోంది.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం

గుంటూరు నగరపాలక సంస్థ పరిధిలో వీధి వ్యాపారుల నుంచి ఆశీలు వసూలు చేసే హక్కు ఎవరికీ లేదు. వీధి వ్యాపారులు ఎవరికి కూడా రూపాయి కట్టాల్సిన పనిలేదు. ఎవరైనా డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలిస్తే మా దృష్టికి తీసుకువచ్చి, ఫిర్యాదు చేస్తే తగిన చర్యలు తీసుకుంటాం.

– చల్లా ఓబులేసు, జీఎంసీ అదనపు కమిషనర్

నాలుగు లైన్ల రహదారితో మేలు

బాపట్ల ఎంపీ టి.కృష్ణప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ టి.కృష్ణప్రసాద్, చిత్రంలో ఎమ్మెల్యేలు, కలెక్టర్లు

గుంటూరు వెస్ట్: అమరావతి అవుటర్ రింగ్ రోడ్డు నుంచి నిజాంపట్నం పోర్టు వరకు నూతనంగా నిర్మించనున్న నాలుగు లైనుల (గ్రీన్ ఫీల్డ్) రోడ్డు నిర్మాణంతో ఎందరికో మేలు జరుగుతోందని బాపట్ల ఎంపీ టి.కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని మినీ శంకరన్ హాలులో స్టేక్ హోల్డర్స్‌తో నిర్వహించిన సమావేశంలో ఎంపీతోపాటు, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, బాపట్ల జిల్లా కలెక్టర్ జె.వెంకటమురళి, గుంటూరు జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, వేమూరు ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, బాపట్ల ఎమ్మెల్యే వి.నరేంద్రవర్మ, జీఎంసీ కమిషనర్ పులి శ్రీనివాసులు, తెనాలి సబ్ కలెక్టర్ సంజనా సిన్హా పాల్గొన్నారు. ఎంపీ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ అమరావతి రింగ్‌రోడ్డు నుంచి నిజాంపట్నం పోర్టు వరకు 47.848 కిలోమీటర్లు నాలుగు లైనుల రోడ్డు నిర్మాణం వల్ల ఎన్నో ఆర్థిక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రోడ్డు నిర్మాణానికి అనుమతులు తీసుకొచ్చామన్నారు. ఆరు మాసాల్లో నిర్మాణ పనులకు అనుమతులు పొందిన తరువాత మరో 18 నెలల్లో రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, బాపట్ల జిల్లా కలెక్టర్ మురళిలు మాట్లాడుతూ ఆర్ అండ్ బీ, విద్యుత్ శాఖ, ఇరిగేషన్, ఫిషరీస్, వ్యవసాయం, పంచాయతీరాజ్, దేవాదాయ శాఖ, అటవీ శాఖ అధికారులు వారి వారి శాఖలకు సంబంధించి ఏవైనా అంశాలు ఉంటే పూర్తి వివరాలతో శుక్రవారం సాయంత్రంలోపు అందించాలని పేర్కొన్నారు. అధికారులు అందించిన వివరాలు క్రోడీకరించి ప్రాజెక్టు రిపోర్టు తయారు చేసి ఢిల్లీలోని నేషనల్ హైవే అథారిటీ వారికి పంపుతామని వివరించారు. అనంతరం రోడ్డు నిర్మాణానికి సంబంధించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను నేషనల్ హైవే అథారిటీ అధికారులు వివరించారు. సమావేశంలో ఎన్‌హెచ్ ఏఐ పార్వతీశం, డీఆర్వో షేక్ ఖాజావలి, డీపీఓ నాగసాయికుమార్, పంచాయతీరాజ్ ఎస్ఈ బ్రహ్మయ్య పాల్గొన్నారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో మంగళవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. **4,000** గరిష్ఠం : రూ. **6,000**

మోడల్ ధర రూ. **5,000**

మిర్చి యార్డు సమాచారం (మంగళవారం ధరలు)



వచ్చిన బస్తాలు	1,04,743
అమ్మకాలు (గత నిల్వలతో కలిపి)	1,12,001
నిల్వ	37,465

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	రూ. 9,500 – 13,200
నంబరు–5	రూ. 10,000 – 12,500
273	రూ. 10,000 – 12,400
341	రూ. 10,000 – 13,300
4884	రూ. 10,000 – 11,200
తాలుకాయలు	రూ. 4,500 – 6,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	రూ. 10,000 – 13,800
షార్క్–1	రూ. 10,000 – 12,000
బాడిగ – 355	రూ. 10,000 – 13,000
దేవనూరు డీలక్స్	రూ. 10,000 – 12,600
ఆర్మూర్	రూ. 9,800 – 11,200
తాలు	రూ. 4,500 – 6,500

–కొరిటెపాడు (గుంటూరు)

క్లుప్తంగా

పసుపు ధరలు



దుగ్గిరాల: దుగ్గిరాల పసుపు యార్డుకు మంగళవారం 823 బస్తాలు వచ్చాయి. పసుపు మొత్తం అమ్మకం చేసినట్లు వ్యవసాయ మార్కెట్ యార్డు కార్యదర్శి ఎన్.శ్రీనివాసరరావు ఒక ప్రకటనలో తెలిపారు.

● కొమ్ములు 549 బస్తాలు వచ్చాయి. కనిష్ఠ ధర రూ.10,000. గరిష్ఠ ధర రూ.11,250, మోడల్ ధర రూ.10,800. కాయలు 274 బస్తాలు వచ్చాయి. కనిష్ఠ ధర రూ.10,000, గరిష్ఠ ధర రూ.11,250, మోడల్ ధర రూ.10.800. మొత్తం 617.250 క్వింటాళ్లు అమ్మకాలు జరిగినట్లు తెలిపారు.

చెరువు భూములపై బడాబాబుల కన్ను

- పాములపాడులో ఎస్సీలకు చెందిన చెరువు భూముల్లో ప్రైవేటు సర్వే
- లోకేష్, బాలకృష్ణలు కొనుగోలు చేస్తున్నారంటూ ప్రచారం!
- రెండో దశ పూలింగ్‌లో లాభ పడేందుకే అంటున్న గ్రామస్తులు



సర్వే చేసేందుకు ప్రైవేటు సర్వేయర్లు ఏర్పాటు చేసుకున్న పరికరాలు

తాడికొండ: తాడికొండ మండలం పాములపాడులో ఎస్సీలకు చెందిన చెరువు భూములు కారుచౌకగా కొట్టేసేందుకు బడా బాబులు రంగంలో దిగారు. రెండో దశలో పూలింగ్ జరుగుతుందనే ఊహాగానాలు వెలువడడంతోపాటు, కొన్ని గ్రామాల్లో నోటిఫికేషన్, గ్రామ సభలు ప్రారంభమైన నేపథ్యంలో కారుచౌకగా భూములు కొట్టేసేందుకు పావులు కదుపుతున్నారు. ఇందులో భాగంగానే పాములపాడులోని చెరువు పోరంబోకు సర్వే నంబరు 132లో 30.50 ఎకరాలపై మంగళవారం ప్రైవేటు సర్వేయర్లతో కొలతలు వేయించి దళితుల భూముల కొనుగోలు ప్రక్రియ ప్రారంభించారు. ఎకరా రూ. 17లక్షల నుంచి రూ. 19 లక్షలు చొప్పున భూములు కొనుగోలు చేస్తాం, డీకే పట్టాలు ఉంటే తమకు అప్పజెప్పడంటూ అభయమిస్తున్నారని గ్రామస్తులు చెబుతున్నారు. విజయవాడకు చెందిన ప్రైవేటు సర్వేయర్ల బృందం కొలతలు వేస్తుండటంతో గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న వీఆర్‌ఓ సర్వే నిలుపుదల చేయించారు. విషయంపై ఆరా తీయగా, ఎవరో విజయవాడకు చెందిన వ్యక్తులు కొనుగోలు చేసేందుకు వచ్చారని, తమకు అంతకు మించి ఏమీ తెలియని గ్రామస్తులు చెబుతున్నారు. ఒక్కో రైతు ఖాతాలోకి రూ. 11వేలు చొప్పున బయానా ఇచ్చి ఇప్పటికే భూములు స్వాధీనం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు.

పూలింగ్‌లో లాభపడేందుకే..!

పాములపాడు, వరగాని, రావెల, గ్రామాల్లో సినీ హీరో నందమూరి బాలకృష్ణ, భార్య వసుంధర పేరిట భూములు కొనుగోళ్లు జరిగాయి. వీటితోపాటుగానే ఈ భూములు కూడా లోకేష్, బాలకృష్ణ అనుచరులు కొనుగోలు చేస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. గతంలో చౌడు, బీడు, సాగుకు పనికి రాని భూములను రూ. 25లక్షల నుంచి రూ. 30 లక్షలకు కొనుగోలు చేయగా, ఇప్పుడు ఏకంగా చెరువు భూముల మీద కన్ను పడింది. ఒకే ప్రాంతంలో 30 ఎకరాల భూమి దానికి కొంత పోరంబోకు, కలిపి సుమారు 40 ఎకరాల వరకు భూమి ఉంటుందని, అంచనా. పూలింగ్ ప్రక్రియలో లాభ పడేందుకే బడాబాబులు కొనుగోలు చేయనున్నట్లు తెలుస్తోంది. గతంలో రాజధాని పూలింగ్‌లో సైతం లంక, అసైన్డ్ భూములు ఇదే రీతిలో కొనుగోలు చేసి బినామీ పేర్లతో పూలింగ్‌కు ఇచ్చి టీడీపీ మంత్రులు, అనుయాయులు భారీగా లబ్ధి పొందారు. ఇప్పుడు రెండో దశ పూలింగ్ అని, ఊహాగానాలు ప్రారంభం కావడంతో మళ్లీ పేదల భూములపై అధికార పార్టీ నాయకుల కన్ను పడింది.

విద్యార్థులు మరింత పట్టుదలతో ముందుకెళ్లాలి

కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: విద్యార్థులు జీవితంలో ఉన్నత ఆశయాలను సాధించుకోవాలంటే మరింత పట్టుదలతో ముందుకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఎస్ఎస్‌సీ 2025 పరీక్షల్లో 580 మార్కులకు పైబడి సాధించిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 600లకు గాను 580పైబడి 34 మంది సాధించడం అభినందనీయమన్నారు. విద్యార్థి దశలో పదో తరగతి చాలా కీలకమని పేర్కొన్నారు. భవిష్యత్తు పునాదులకు లక్ష్యం ఏర్పడుతుందని తెలిపారు. వచ్చే ఏడాది ఎస్ఎస్‌సీ పరీక్షల్లో జిల్లాను మొదటి స్థానంలో నిలిపేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. ఈక్రమంలో కలెక్టర్ పదో తరగతి నుంచి ఐఏఎస్ వరకు తన ప్రస్థానాన్ని విద్యార్థులకు వివరించి, స్ఫూర్తిని నింపారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ భార్గవ్‌తేజ, డీఈఓ రేణుక, ప్రభుత్వ పరీక్షల అసిస్టెంట్ కమిషనర్ కె.వెంకటరెడ్డి, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులను ఘనంగా సత్కరించారు.



జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మితో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు

చలపతి ఇంజినీరింగ్ కళాశాలకు ఎన్‌బీఏ అక్రిడిటేషన్



అక్రిడిటేషన్ పత్రాలు చూపుతున్న చలపతి విద్యా సంస్థల కార్యదర్శి సుజిత్, ప్రిన్సిపాల్, అధ్యాపకులు

మోతడక (తాడికొండ): మోతడక చలపతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలకు కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ప్రోగ్రామ్‌లకు నేషనల్ బోర్డు ఆఫ్ అక్రిడిటేషన్ న్యూ ఢిల్లీ మూడు సంవత్సరాల కాల వ్యవధితో రెండోసారి అక్రిడిటేషన్ మంజూరు చేసిందని కళాశాల చైర్మన్ వై.వి.ఆంజనేయులు తెలిపారు. ఎన్‌బీఏ ఇచ్చిన ఎక్స్‌పర్ట్ కంపెనీ ఫిబ్రవరి 15న కళాశాలను సందర్శించి వసతులు, పాటిస్తున్న విద్యా ప్రమాణాలు, జరుగుతున్న పరిశోధన, అభివృద్ధికి సంబంధించిన విషయాలు, అధ్యాపకుల ప్రమాణాలు, సంస్థలో పాటిస్తున్న విద్యాబోధన, తదితర వాటిని పరిశీలించి అక్రిడిటేషన్ మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈసందర్భంగా కళాశాలకు అక్రిడిటేషన్ గుర్తింపు రావడంపై చైర్మన్ వై.వి.ఆంజనేయులు, కార్యదర్శి వై.సుజిత్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగశ్రీనివాస్‌లు హర్షం వ్యక్తం చేశారు. గుర్తింపు రావడానికి కారకులైన విద్యార్థులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, అధ్యాపక బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో అకడమిక్ డీన్ ఫణికుమార్, డాక్టర్ పి.బాలమురళీకృష్ణ, డాక్టర్ సుబ్బారావు, డాక్టర్ జయకృష్ణ, పలు శాఖాధిపతులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు జెడ్పీ చైర్‌పర్సన్ అభినందనలు



విద్యార్థినులతోపాటు ఉపాధ్యాయులను అభినందిస్తున్న హెనీ క్రిస్టినా

గుంటూరు ఎడ్యుకేషన్ : గత నెలలో విడుదలైన టెన్త్ పబ్లిక్ పరీక్షల ఫలితాల్లో కొల్లిపర మండలం మున్నంగి జెడ్పీ హైస్కూల్ నుంచి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను జెడ్పీ చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా మంగళవారం గుంటూరులోని క్యాంపు కార్యాలయంలో అభినందించారు. 587 మార్కులు సాధించిన చుక్కా జీవన్, 583 మార్కులు పొందిన నలుకుర్తి సుచరిత, 580 సాధించిన మున్నంగి మహిమను అభినందించిన హెనీ క్రిస్టినా భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. విద్యార్థినులు ఎంచుకున్న లక్ష్యంపై గురి పెట్టి, ఉన్నత చదువులు చదవాలని సూచించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సహకారంతో జీవితంలో ఉన్నతస్థాయికి చేరుకోవాలని అన్నారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పి.అప్పారావుతోపాటు ఉపాధ్యాయులు పి. సాంబశివరావు, వి.నాగ వరప్రసాద్‌ను అభినందించారు.

జర్నలిస్టులకు ప్రత్యేక హెల్త్ కార్డులు ఇస్తాం

- ఐఎస్ఏ జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ పమిడిముక్కల విజయ
- ఏపీయూడబ్ల్యూజే ఆధ్వర్యంలో డాక్టర్ విజయకు సన్మానం



డాక్టర్ విజయను సన్మానిస్తున్న జర్నలిస్టుల సంఘం నేతలు

గుంటూరు మెడికల్: జర్నలిస్టులకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు ఎదురైనా లలితా సూపర్ స్పెషాలిటి హాస్పిటల్ తరుపున పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందిస్తామని గుంటూరు లలితా సూపర్ స్పెషాలిటి హాస్పటల్ అధినేత, ఇండియన్ స్ట్రోక్ అసోసియేషన్(ఐఎస్ఏ) జాతీయ అధ్యక్షురాలు డాక్టర్ పమిడిముక్కల విజయ చెప్పారు. ఐఎస్ఏ జాతీయ అధ్యక్షురాలిగా డాక్టర్ విజయ ఎన్నికైన సందర్భంగా మంగళవారం గుంటూరు ఎల్‌వీఆర్ క్లబ్‌లో ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆమెను సన్మానించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐ.వీ సుబ్బారావు, జిల్లా అధ్యక్షుడు నాగుల్ మీరా, ప్రధాన కార్యదర్శి కె.రాంబాబు, తదితరులు డాక్టర్ విజయను ఘనంగా సత్కరించి అభినందించారు. విజయ మాట్లాడుతూ జర్నలిజం వృత్తి ఎంతో రిస్క్‌తో కూడుకున్నదని, ప్రజలు, వ్యవస్థలకు సంధానకర్తగా జర్నలిస్టు పని చేస్తారని తెలిపారు. వారి జీవన పరిస్థితులను అర్థం చేసుకుని తమవంతు బాధ్యతగా లలిత హాస్పిటల్ తరపున ప్రత్యేక హెల్త్ కార్డులు అందజేస్తామని ప్రకటించారు. జర్నలిస్టులకు ఎలాంటి అనారోగ్య సమస్యలు ఎదురైనా పూర్తిగా అండగా వుంటామని హామీ ఇచ్చారు. బేసిక్ హెల్త్ స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని జర్నలిస్టులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ విజయ తెలిపారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు మాట్లాడుతూ జర్నలిస్టులకు లలితా హాస్పటల్ యాజమాన్యం చేస్తున్న ఉచిత వైద్యసేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో యూనియన్ గుంటూరు నగర అధ్యక్షుడు వజ్రె కిరణ్‌కుమార్, కార్యదర్శి కందా ఫణీంద్ర కుమార్, ఎలక్ట్రానిక్ మీడియా రాష్ట్ర అధ్యక్షుడు ఏచూరి శివ, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పుల్లగూర భక్తవత్సలరావు, శ్రీనివాసరావు, సుపర్ణ, చలపతిరావు, పల్నాడు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, జగన్‌మోహన్‌రెడ్డి, విద్యాధర మురళి, మార్కండేయులు, ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు పాల్గొన్నారు.

జర్నలిస్టులపై కేసులు పెడితే సహించేది లేదు

జర్నలిస్టులపై కేసులు పెడితే సహించేది లేదని ఆంధ్రప్రదేశ్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (ఏపీయూడబ్ల్యూజె) రాష్ట్ర అధ్యక్షుడు ఐవీ సుబ్బారావు హెచ్చరించారు. జర్నలిస్టులను కించపరిచే విధంగా వ్యవహరించకుండా, ప్రభుత్వ తీరును మార్చుకోవాలని హితవు పలికారు. సోమవారం గుంటూరు ఎల్‌వీఆర్ క్లబ్‌లో యూనియన్ జిల్లా కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సుబ్బారావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోసం జర్నలిస్టులు ఐక్యంగా పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. హెల్త్ స్కీం కూడా సక్రమంగా అమలు కావడం లేదన్నారు. అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈనెల 23న ఒంగోలులో యూనియన్ రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

తైక్వాండో పోటీల్లో పలువురికి పతకాలు



పతకాలు అందుకున్న విద్యార్థులతో కోచ్ శ్రీనివాసరావు

తెనాలిఅర్బన్: ఇండియన్ తైక్వాండో వారు నిర్వహించిన ఫస్ట్ ఫెడరేషన్ కప్, కిడ్స్ చాంపియన్ షిప్ పోటీల్లో తెనాలి కెఎస్ఆర్ తైక్వాండో అకాడమికి చెందిన షణ్ముఖ అభిరామ్, లంకరాజు శిరీషలకు బంగారు పతకాలు, లంకరాజు శ్రీ శౌర్యకు వెండి పతకం లభించినట్లు కోచ్ కె.శ్రీనివాసరావు తెలిపారు. వీటిని మహారాష్ట్రంలో ఏప్రిల్ 25నుంచి మే ఒకటి వరకు నిర్వహించినట్లు చెప్పారు. పతకాలు సాధించిన విద్యార్థులను మంగళవారం అకాడమి ఆవరణలో అభినందించారు. కార్యక్రమంలో వీరవల్లి మురళి, కె.నాగభూషణం, టి.పోతురాజు, కె.వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

కొడుకులు.. కఠినాత్ములు

- మంచాన పడ్డ తల్లిని పట్టించుకోని కుమారులు
- మాకేం సంబంధం లేదంటూ హూంకరింపు



వృద్ధురాలు మాణిక్యమ్మ

మంగళగిరి: "ముగ్గురు కుమారులకు జన్మనిచ్చింది.. వారికి కష్టం అంటూ తెలియకుండా భర్తతో కలిసి కష్టపడుతూ గారాబంగా పెంచి, విద్యాబుద్ధులు చెప్పించి, పెద్దవారిని చేసింది. అందరికీ పెళ్లిళ్లు చేసి.. జీవితాలు చక్కదిద్దింది. ఈక్రమంలో ముదిమి మీదపడింది.. భర్త కాలం చేశాడు.. పుట్టెడు దుఃఖంలో ఉన్నా అండగా కొడుకులు ఉన్నారులే.. అంటూ సముదాయించుకుని, కుమారుల చెంతకు చేరింది. వారు కనీసం ఇళ్లల్లోకి రానివ్వలేదు సరికదా.. ముఖం పైనే తలుపులేశారు. పోనీలే.. వాళ్లకు తెలీదులే అనుకుంటూ వేరే చోట ఇల్లు అద్దెకు తీసుకుని, కూలీనాలీ చేసుకుంటూ ఒంటరిగా బతక సాగింది. ఇంతలో విధి వక్రీకరించి, కాలు విరిగింది. తన పనులు తాను చేసుకోలేని దుస్థితిలో మంచానపడింది. ఇంటియజమానులు ఖాళీ చేయాల్సిందేనంటూ హుకూం జారీచేయగా, కొందరు సహృదయులు ఆమెను ఆటోలో కన్నకొడుకుల ఇళ్లకు తీసుకెళ్లారు. మంచానపడి దీనావస్థలో ఉన్న ఆ వృద్ధ తల్లిని చూసికూడా కరగలేదా పాషాణ హృదయాలు.. ఆమెకు మాకు ఏసంబంధం లేదంటూ.. మా ఇంటికి ఎందుకుతెచ్చారంటూ తెచ్చినవారిపై పోట్లాటకు దిగారు."

వివరాల్లోకి వెళితే పెదకాకాని మండలం నంబూరుకు చెందిన కొండవీటి మాణిక్యమ్మకు ముగ్గురు కుమారులు. భర్త మృతి చెందాడు. తాను పెంచి పోసించిన కుమారులు ఎవరు ఇంటిలోనికి రానివ్వకపోవడంతో మండలంలోని పెదవడ్లపూడి చేరుకుని తన రెక్కల కష్టం మీద బతుకుతుంది. ఒక చిన్న ఇల్లు అద్దెకు తీసుకుని ప్రశాంతంగా నివసిస్తున్న మాణిక్యమ్మ ఇటీవల బాత్రూమ్‌లో కాలు జారిపడడంతో దెబ్బతగిలి నడవలేని స్థితికి చేరుకుంది. దీంతో వంట కూడా చేసుకోలేని దుస్థితి నెలకొంది. ఇంటి యజమాని ఇల్లు ఖాళీ చేయమనడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న మాణిక్యమ్మ దుస్థితిని తెలుసుకున్న గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ అన్నే చంద్రశేఖర్ ఆమెను ఆటోలో తీసుకుని పెదకాకానిలోని కుమారులు వద్దకు తీసుకెళ్లాడు. కుమారులు తమకు ఆమెకు, మాకు సంబంధం లేదని తెగేసి చెప్పడంతో వృద్ధురాలిని పెదకాకాని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి ఫిర్యాదు చేశాడు.

కౌలు రైతుల పరిస్థితి దయనీయం



సమావేశంలో మాట్లాడుతున్న జంగాల అజయ్‌కుమార్

లక్ష్మీపురం: రాష్ట్రంలో కౌలు రైతుల పరిస్థితి దయనీయంగా తయారైందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జంగాల అజయ్‌కుమార్ అన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మంగళవారం గుంటూరు నగరం కొత్తపేటలోని మల్లయ్య లింగం భవన్‌లో ఏపీ కౌలు రైతుల సంఘం జిల్లా సమితి ఆధ్వర్యంలో కంజుల విఠల్‌రెడ్డి అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కమ్యూనిస్టు పార్టీల నేతలు, రైతు సంఘాల నాయకులు పాల్గొన్నారు. జంగాల అజయ్ కుమార్ మాట్లాడుతూ కౌలు కార్డులు అందక కౌలు రైతులు అప్పుల పాలై ఆత్మహత్యలు చేసుకొనే పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క గుంటూరు జిల్లాలోనే పదుల సంఖ్యలో కౌలు రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి కౌలు రైతులకు కౌలు కార్డులు, బ్యాంక్ రుణాలు, అకాల వర్షాలతో నష్టపోయినవారికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కౌలు రైతుల సమస్యలపై ఈ నెల 13న గుంటూరు కలెక్టరేట్ వద్ద నిర్వహించనున్న ధర్నాలో కౌలురైతులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

నల్లచెరువులో ఎస్పీ పర్యటన



సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ

పట్నంబజారు: గుంటూరు జిల్లా ఎస్పీ ఎస్ సతీష్‌కుమార్ మంగళవారం ఈస్ట్ సబ్ డివిజన్ పరిధిలోనీ నల్ల చెరువులో ప్రాంతంలో పర్యటించారు. లాలాపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్ అగ్రహారం, వాకింగ్ ట్రాక్ ప్రాంతం, వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయం, బొమ్మల సెంటర్, నల్లచెరువు, సంపత్ నగర్‌లో ప్రత్యేక బలగాలతో కాలినడకన పర్యటించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఆయా ప్రాంతాల్లోని శాంతిభద్రతల అంశంపై స్థానికులను ఆరా తీశారు. నల్ల చెరువులో నివసించే మహిళలతో మాట్లాడి సమస్యలు పరిష్కరించేందుకు అన్నివేళలా పోలీసులు అందుబాటులో ఉంటారని భరోసా ఇచ్చారు. ఈస్ట్ సబ్ డివిజన్ డీఎస్పీ అబ్దుల్ అజీజ్, లాలాపేట సీఐ శివప్రసాద్, ఎస్పీ సీఐ ఏ.శ్రీనివాస్ సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

లక్ష్మీపురం: బర్లీ పొగాకును నేరుగా రాష్ట్ర ప్రభుత్వమే కొనుగోలు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి ఎం.హరిబాబు డిమాండ్ చేశారు. మంగళవారం బ్రాడీపేటలోని కౌలు రైతు సంఘం జిల్లా కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు అధ్యక్షతన జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో హరిబాబు పాల్గొని మాట్లాడారు. జిల్లాలో ఈ సంవత్సరం 86 వేల ఎకరాలు బర్లీ పొగాకును రైతాంగం అనేక వ్యయ ప్రయాసలకోర్చి సాగు చేశారన్నారు. గతంలో క్వింటా రూ. 18వేలకు కొనుగోలు చేయగా ఈ సంవత్సరం రూ.4వేలు మాత్రమే ధర పలికిందన్నారు. రైతాంగం అప్పులు చేసి పంట సాగు చేశారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రంగంలోకి దిగి క్వింటా రూ.15 వేలకు కొనుగోలు చేయాలని కోరారు. వ్యవసాయ శాఖామంత్రి, కంపెనీల అధికారులు వెంటనే స్పందించి పొగాకు కొనుగోలు చేయాలని కోరారు. కౌలు రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి పాశం రామారావు మాట్లాడుతూ కార్మికులు, రైతాంగం, పేద ప్రజలు ఎదుర్కొనే సమస్యల పరిష్కారానికి ఈనెల 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను, గ్రామీణ హర్తాళ్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గుంటూరు ఛానల్ పనులు ప్రారంభించాలని, నల్లమడ ఆధునికీకరణకు నిధులు కేటాయించాలని సమావేశంలో తీర్మానం చేశారు. సమావేశంలో జిల్లా కమిటీ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా బొట్ల రామకృష్ణ, నాగమల్లేశ్వరరావులు ఎన్నికయ్యారు. కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు ములకా శివ సాంబిరెడ్డి, పి కృష్ణ, అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

రేపటి నుంచి కేఎల్‌యూలో ఇంజినీరింగ్ కౌన్సెలింగ్

తాడేపల్లి రూరల్: కేఎల్ యూనివర్సిటీ విజయవాడ, హైదరాబాద్ క్యాంపస్‌లలో ఇంజినీరింగ్ కోర్సులలో ప్రవేశం కోసం ఈనెల 8వ తేదీ నుంచి 11వ తేదీ వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ జె. శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 8వ తేదీ ఉదయం 9.30 గంటలకు కౌన్సెలింగ్ ప్రారంభం అవుతుందని, జాతీయ స్థాయిలో నిర్వహించిన కేఎల్ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షల్లో 30 వేల లోపు ర్యాంకులు వచ్చిన విద్యార్థులు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కోటా కింద ఇంటర్‌లో 60 శాతం కన్నా ఎక్కువ మార్కులు వచ్చిన విద్యార్థులు, స్పోర్ట్స్, ఎన్‌సిసి, సాంస్కృతికం, ఎక్స్ సరీస్‌మెన్ కోటా కింద మొదటి రోజు కౌన్సెలింగ్‌లో పాల్గొంటారని, అలాగే ఓపెన్ కేటగిరిలో ఇంటర్‌లో 80 శాతం పైగా మార్కులు పొందిన విద్యార్థులు కూడా పాల్గొంటారని, 9,10,11 తేదీల్లో కేఎల్ ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్షల్లో 30 వేలకు పైగా వచ్చిన ర్యాంకర్లు, ఓపెన్ కేటగిరి కింద ఇంటర్, జెఈఈలలో మెరిట్ మార్కులు వచ్చిన విద్యార్థులు పాల్గొంటారని, మెరిట్ విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు కూడా అందిస్తున్నామని, కౌన్సెలింగ్‌కు సంబంధించిన సమాచారాన్ని విద్యార్థులకు తెలియజేశామని ఆయన తెలిపారు.